# శ్రమయేవ జయతే

## —కన్నేపల్లి చలమయ్యశాస్త్రి

**జానకిరామయ్యగారు** విసుగ్గా చూశారు ఇంట్లోకి. మనవడి మీద కేక లేస్తోంది కోడలు శారద. "వెధవా! నీ కెన్నిసార్లు చెప్పినా బుద్ధి రాదేంరా? ఉన్న పెరుగంతా నువ్వే పోసుకుంటే మిగిలిన వాళ్ళ సంగతేం గాను? ఇప్పుడు స్కూలు నుండి వస్తుం దా మహాతల్లి భారతి! నా ప్రాణాలు తోడేస్తుంది. దానికి జవాబు చెప్పలేక, మీ తాతగారి చేత మాటలు పడలేక నా ప్రాణం నలిగిపోతోంది. వెధవ సంత. వెధవ సంతాని!"

పరిస్థితి అర్థమయింది జానకిరామయ్యగారికి.

పసివెధవ. వాడికి పెరుగన్నా, మీగడ తరగలన్నా ఇష్టం మరి. కోరి కోరి వాడికి గోపాలకృష్ణ పేరు పెట్టింది తనే గదా!

గడ్డ పెరుక్కీ, మీగడ తరగలకీ మొహం వాచే దరిద్రపు రోజులు వచ్చి పడ్డాయి.

ఎంతలో ఎంతగా మారిపోయింది తమ పరిస్థితి!

ఎంతగా దిగజారి పోయింది బతుకు!

ఎక్కడికి పోయాయి ఆ పాడీ, పంటా?

ఎలా మాయమయిం దా గత వైభవం?

మజ్జిగ నీళ్ళకని మధ్యాహ్నం పన్నెండు గంటలకు ఈ ఇంటి ముందు ఎంతమంది నించునే వారు గిన్నెలు పట్టుకుని!

హరితం ఇగిరిపోయింది.

సౌభాగ్యం మట్టి కొట్టుకు పోయింది.

గత వైభోగాల గుర్తుల్నే తలపోస్తూ, వాస్తవంలో చేదు జీవితాన్ని గడపలేక నలిగిపోతూ జీవచ్ఛవంలా మిగిలిన తను!

గట్టిగా నిట్టూర్చి మళ్ళీ 'భాగవతం'లోకి తల దూర్చారు. కానీ, అందులోనూ అదే ఘట్టం.

చిలిపి కృష్ణుడి వేడుకైన అల్లరి.

యశోదమ్మతో గోప స్త్రీలు మొర పెట్టుకుంటున్నారు. ఈ గొడవలో భారతి స్కూలు నుండి రానే వచ్చింది. ఎప్పటిలానే గొడవ లేవదీసింది.

"తిండికి మొహం వాచే దరిద్ర గొట్టుల్ని కన్నా నెందుకురా, దేవుడా! నా ప్రాణం తినేస్తారేం మీరు? మీతో మరొక్క క్షణం వేగలేను. అసలు వాడు పోసేదే కటిక నీళ్ళు. అందులో వెన్న ఏముంటుంది? పెరుగు ఏం గడ్డ కడుతుంది? ఇంటిల్లిపాదీ ఆ నీళ్ళే సర్దుకుపోవాలి. కానీ ఈ బకాసురుడు కొంపకి దాపురించాడు..."

గోపి ఏదో పెడసరంగా జవాబు చెప్పినట్టున్నాడు.

శారద వాడి నో రెండు దరువులు వేసింది. వాడు ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా వెంటనే ఏడుపు లంకించుకున్నాడు.

జానకిరామయ్యగారికి వద్దనుకుంటున్నా ఆ గొడవ వినబడుతూనే ఉంది. తమాయించుకోలేక పోయారు.

"అమ్మాయ్, శారదా!" మందలించినట్టు కేక వేశారు.

శారద రుసరుసల స్థాయి తగ్గింది... గోపి ఏడుపు అలానే ఉంది.

భారతి ఎంత వేగంగా భోజనం ముగించిందో కానీ, అదే వేగంతో స్కూలుకి బయల్దేరింది.

"ఇలా రామ్మా." పిలిచారు జానకిరామయ్యగారు.

"అవతల క్లాసుకి టైమై పోతోంది, తాతయ్యా."

"రెండు గంటలు కొట్టినంతవరకూ మాస్టర్లెవ్వరూ క్లాసులకి రారని నాకు తెలియదనుకున్నావటమ్మా! రెండు నిమిషాలు నీతో మాట్లాడాలి. ఇలా కూచో..."

"అక్కర్లేదులే, తాతయ్యా! నిల్చునే వింటాను. మీరు చెప్పదలుచుకున్న దేమిటో త్వరగా తెమల్చండి." అసహనంగా అంది.

జానకిరామయ్యగారు విస్తుపోయారు.

ఈ కాలపు పిల్లలలో క్రమశిక్షణ పూర్తిగా లోపించింది. నైరాశ్యం నిలువెల్లా ఆవరించుకుంది. అసహనం అణువణువునా చోటు చేసుకుంది.

దీనికి ఎవర్ని తప్పుపట్టాలో తోచడం లేదు.

"ఏమిటి, తాతయ్యా, ఆలోచనలో పడ్డారు? ఏదో చెబుతా నన్నారు కదా..."

క్రీగంట ఆమెను చూశారు జానకిరామయ్యగారు.

నిన్న మొన్నటి పిల్ల!

బాలసారె ఇప్పుడే జరిగినట్టు, పొత్తిళ్ళలో కేరింతలు పెడుతున్నట్టు కనిపిస్తుంది తన కళ్ళకి.

ఎంతలో ఎంతగా ఎదిగిపోయింది!

ఆడపిల్ల, అరటిచెట్టు నిమ్మళంగా నీరు పట్టాలే గానీ ఎంత సేపు ఏపుగా ఎదగడానికి!

"రోజు రోజుకీ నువ్వు పెద్దదాని వవుతున్నావు, తల్లీ. రేపో, మాపో కాలేజీలో అడుగెడతావు కూడా! నీ కన్నా గోపి ఏడేళ్ళు చిన్నవాడు. వాడికి జిహ్వా చాపల్యం ఎక్కువ. వాడేదో పొరపాటు చేశాడని అమ్మని బాధించటం తప్పు కాదామ్మా? పెద్దదానివి, నువ్వే ఎలాగో సర్దుకు పోవాలి గానీ..."

"అవును, తాతయ్యా. అసలు ఆడపిల్లనై పుట్టడమే నేను చేసిన నేరం. ప్రతి దానికీ నన్నే తప్పు పడ్తారు మీ రంతా. అన్నయ్య నేదైనా అనబోతే నీ కన్నా పెద్దవాడు- వాడిమీద తిరుగుబా టేమిటే అని అమ్మ విరుచుకు పడ్తుంది. వీడినేదైనా అంటే మీరు!"

జారిపోతున్న పైటని నిర్లక్ష్యంగా సర్దుకుంటూ విసవిసా వెళ్ళిపోయింది భారతి.

జానకిరామయ్యగారికి మాట పెగల్లేదు.

అణకువగా ఉండాల్సిన ఆడపిల్ల తిరుగుబాటు చేస్తోంది.

భూదేవంత సహనం వహించాల్సిన స్త్రీ ప్రళయకాళిగా రూపు దిద్దుకుంటోంది.

భగవంతుడా! ఈ తరం ఎటు పరుగులు తీస్తోంది?

మనసు కకా వికలమైంది.

కళ్ళు మూసుకుని భవిష్యద్దర్శనానికి ప్రయత్నిస్తున్నారు.

"ఏమిట్రా- పట్టపగలే నిద్ర పోతున్నావ్! పగటి నిద్ర ఒంటికి మంచిది కాదోరే" అన్న పలకరింపుతో ఉలిక్కి పడి కళ్ళు తెరిచాడు.

వసంతరావు చిర్నవ్వుతో.

"ఏం లేదురా- ఏదో ఆలోచనలో పడ్డాను. ఎంత సేపయింది నువ్వొచ్చి?"

వసంతరావు చాపమీద చతికిలపడ్డాడు. "అయిదు నిమిషా లయి ఉంటుందనుకుంటా! నిన్నెందుకు లేపడం అని కా స్సేపు ఇలానే నిల్చున్నాను. వెళ్ళిపోదామనే అనుకున్నా కానీ, నీతో మాట్లాడకుండా వెళ్ళడానికి మనసొప్పుతుందట్రా?"

వసంతరావు దాదాపు తన ఈడువాడే. తనకన్నా మహా అయితే రెండు సంవత్సరాలు చిన్న కావచ్చు.

కానీ, వాణ్ణి చూస్తే అంత వయసున్న వాడిలా కనిపించడు. తల ముగ్గుబుట్టలా పండిపోయిందే కానీ, శరీర పటుత్వం తగ్గలే దింకా.

అదృష్టవంతుడు.

గవర్నమెంట్ చాకిరీలో చేరి గెజెటెడ్ ఆఫీసర్‌గా రిటైరయ్యాడు. నెల తిరిగేసరికి ఠంచనుగా పెన్షన్ డబ్బులు పుచ్చుకుంటున్నాడు గత అయిదారేళ్ళుగా.

ఆ రోజుల్లో గుమాస్తాగా చేరిన వాణ్ణి చూసి ఎంత ఎద్దేవా చేసేవాడు తను! 'ఒకరి మోచేతి నీళ్ళు తాగి బతికే బతుకు నిజంగా అది బతుకేనట్రా!' అంటూ అవహేళన చేసేవాడు.

ఇంటిలో పాడీ, పంటా పుష్కలంగా ఉన్నందున ఆ రోజుల్లో ఉద్యోగస్థులంటే చాలా తేలికభావం.

వసంతరావు ఎప్పుడూ బాధ పడినట్టు కనిపించలేదు, కనీసం తన ఎదురుగా.

ఇప్పుడు వాణ్ణి చూస్తుంటే, అప్పట్లో తనెంత మూర్ఖంగా ప్రవర్తించేవాడో, వాడి మనస్సు ఎంత గాయపడేదో గుర్తు కొచ్చి ఒళ్ళు జలదరిస్తుంది.

ఏ నూటి పోటి మాటలూ లేకుండానే, ఎదుటి మనిషిని గాయపరచడమనే మహా విద్య తెలిసిన వాడిలా ఈ వీధమ్మట పోయినప్పుడల్లా పలకరిస్తాడు.

వాడి ఖరీదైన బట్టల ముందు, వాడి చేతి వేళ్ళకి మెరిసే రవ్వల ఉంగరాల మెరుపులో, వాడి శరీరం మీంచి తేలి వచ్చే స్నో వాసనల్లో తనొక క్షుద్ర కీటకంలా కంపించిపోతాడు.

వాడి ఉనికి భరించడమే కష్టమవుతోంది.

"ఏమిట్రా, ఎదురుగా చెట్టంత స్నేహితుణ్ణి పెట్టుకుని మళ్ళీ ఏ ఆలోచనలో పడ్డావ్?"

"ఏం లేదురా—ఎందుచేతనో మనస్సు నిలకడగా ఉండడం లే దీ మధ్య! ఏవేవో పిచ్చి ఆలోచనలు మెదులుతున్నాయి."

వసంతరావు సానుభూతిగా చూశాడు.

ఆ చూపు, అలాటి చూపు దుర్భరం.

"ఎందుకురా పనికిమాలిన ఆలోచనలు? నే నంటున్నానని ఏమనుకోకు. కానీ, ఇలాటి ఆలోచ నల్లోంచి బయట పడాలంటే శరీరానికి కావల °స నంత పరిశ్రమ ఉండాలిరా. మనస్సుకి ఆలోచింప జే సే విరామం ఈయకూడదు. వయస్సు పొద్దు వాలుతున్న కొద్దీ ఒంటరితనం ఆవరించి మరింత దిగజారుస్తుంది మనిషిని. ఇ దో విచిత్ర ఘట్టం జీవనగతిలో" అన్నాడు వేదాంతపరంగా.

జానకిరామయ్య ఏదో జవాబు చెప్పబోయేం ..తలో గుమ్మం దగ్గర ఏదో అలికిడి.

కోడలు శారద కాఫీ గ్లాసులతో.

వసంతరావు తనో గ్లాసందుకుని. జానకిరామ య్యా కొకటి అందించాడు.

"మాఘయ్యగారూ. మా పెద్దబ్బాయికి మీరే ఏదో దారి చూపాలండీ."

"ఏది- బాపూజీకేనా! ఆ ప్రయత్నంలోనే ఉన్నా నమ్మా. నా కింద పని చే °సినతనే డి. °స.టి.ఓ.గా వచ్చా డిక్కడికి. అతనితో ప్రసంగవశాత్తూ మన వాడి సంగతి ప్రస్తావించాను. వచ్చే నెలలో ఖాళీ లేవో వస్తాయట. కాగితం పెట్టమన్నాడు. ఆ సంగతి చెబుదామనే వచ్చాను."

శారద పైటకొంగు ఒంటినిండుగా కప్పుకుంది. గట్టిగా నిట్టూర్చింది.

"ఏమిటో, మాఘయ్యగారూ! వాడి కీ జన్మలో ఉద్యోగం రాదేమో అన్న భయం పట్టుకుంది నాకు. డిగ్రీ అయి వచ్చేనెలకి మూ డేళ్ళు కావను ంది. ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా వాడి బతుకు గడిచిపోతుందేమో అని! పిచ్చి నాగన్న- మన సంతా బెంగ నింపుకుని తోటకూర కాడలా వడలి పోతున్నాడు."

"ఛ ఛ. అలా బెంగ పడాల్సిన అవసరం లేదమ్మా! వాడి కేమమ్మా కడిగిన ముత్యం. ఇవాళ కాకపోతే రేపొస్తుంది ఉద్యోగం. ఈ మూ డేళ్ళకి మనం డీలా పడనవసరం లేదు. అయినా, ఈ మారు వాడికి తప్పకుండా ఉద్యోగం సంపాదించి పెడతానన్నాగా... నువ్వేం మనస్సు కష్ట పెట్టుకో కు."

శారద జవాబుగా నిట్టూర్చింది మరోసారి.

"చూడమ్మా మీ రంతా ఉద్యోగం గురించి వాడి మొహం మీదే మాట్లాడితే, మరింత దిగులు పడతా డు వాడు. ఈ విషయం పొరపాటునకూడా వాడి ముందు తీసుకు రాకూడదు."

ఖాళీగ్లాసు లందుకుంది శారద.

"ఏమిటో, మాఘయ్యగారూ! వీడికా ఉద్యోగం రాదు. అదటు పెళ్ళి కెదిగి కూచుంది. సంపా దించే దాయ నొక్కరూ, తినాల్సింది మే మంతా నూ! ఎలా రోజులు గడుస్తాయో..." అంటూ లోనికి వెళ్ళిపోయింది.

వసంతరావు ఆమె వెళ్ళిన వైపే కా స్సేపు చూ °సి, తరవాత జానకిరామయ్య వైపు చూపు మళ్ళించాడు.

జానకిరామయ్య ఈ సంభాషణ పట్ల ఆసక్తి లేని మనిషిలా భాగవతంలోనికి చూస్తూ పిచ్చిగా కాగి తాలు తిప్పుతున్నాడు.

వసంతరావు మరో అయిదారు నిమిషాలు ఏదో పిచ్చాపాటీ మాట్లాడి అక్కణ్ణుండి కదిలాడు.

** ** **

చలికాలం కావడాన అయిదున్నరకే మసక చీకట్లు కమ్ముకున్నాయి.

ఆఫీసునుండి అప్పుడే ఇంటి కొచ్చిన రాఘవ కాస్త కాఫీ తాగి, మళ్ళీ బయల్దేరాడు వీధిలోకి.

వెళ్ళబోతున్న కొడుక్కే °స నిశితంగా చూశారు జానకిరామయ్యగారు.

అప్పట్లో బంతిలా, నిండుగా, చలాకీగా ఉండే రాఘవ ఇప్పుడు బలహీనంగా, జీవన పోరాటంలో ఓడిపోయిన వాడిలా నిరుత్సాహంగా ఉన్నాడు.

తండ్రిని గమనించి అక్కడే ఆగిపోయాడు రాఘవ. తండ్రి తనని ఏదో అడగదలుచుకున్న ట్టు అర్థమైన వాడిలా చెప్పాడు.

"ఎల్లుండి బాపూజీకి హైద్రాబాద్‌లో ఏదో ఇంట ర్వ్యూ ఉందట. నాన్నా! వెళ్ళి రావడానికి ఎలా లేదన్నా నూర్రూపాయ లుండాలి. ఎవరైనా అప్పు పెడతారేమోనని..."

జానకిరామయ్యగారు తల దించుకున్నారు.

రాఘవ వెళ్ళిపోయాడు.

** ** **

"నీ పేరు?"

"మురళీధర్."

"ఏం చదివావు?"

"బి.ఎ. పాసయ్యానండీ- ఫ °స్టక్లా సొచ్చింది!"

జానకిరామయ్యగారు తలెత్తి చూశారు. వీధి పిల్లలంతా వరండాకి అటు వైపు ఆడుకుంటున్నా రు. గోపీ పీట వేసుక్కూచున్నాడు ఆఫీసర్‌లా. వరండా దిగువ చేతులు కట్టుకుని వినయంగా



SAA/HSI/20 TEL

నించున్నాడు బుర్రా రాముడి మనవడు భాస్కరం.

“బి.ఎ. చదివేవా? ఈ ఉద్యోగానికి ఎమ్.ఎ. చదివిన వాళ్ళే ఎంతోమంది వచ్చారు కదా! బి.ఎ. చదివిన నీ కెలా ఇమ్మంటావ్ ఉద్యోగం?”

“అది కాదార్. కావలి స్తే మీ రే పరీక్ష అయినా పెట్టండి. ఎన్ని ప్రశ్నలైనా అడగండి. కానీ ఉద్యోగం లేదనకండి, సార్.”

“లాభం లేదయ్యా! ఈ రోజుల్లో ఉద్యోగాలంటే మాట లనుకున్నావా! ఖాళీ లేదు. వెళ్ళు—వెళ్ళవయ్యా.”

“సార్, సార్. నా బాధ అర్థం చేసుకోండి. సార్. నా కీ ఉద్యోగం దొరక్కపోతే మా ఇంట్లో అంతా పస్తుల్తో మాడి చచ్చిపోతారు, సార్. దయ చూపి ఈ ఉద్యోగం...”

గోపి బెల్ కొట్టినట్టు అభినయించాడు. మరో కుర్రాడు నిక్కరు సర్దుకుంటూ వచ్చి నిల్చున్నాడు వాడి దగ్గరగా.

“ఒరే, భీముడూ. ఈ కుర్రాణ్ణి అవతలికి వంపించెయ్యరా. ఉద్యోగాలు లేవు మొర్రో అంటే జీడిబంకలా పట్టుకుని వదల్డం లేదు. చదివింది బోడి బి.ఎ. గుమాస్తా ఉద్యోగం కావాలట.” విరగబడి నవ్వాడు.

“సాగ్ సాగ్” అంటున్న భాస్కరాన్ని ఈడు



కుంటూ తీసుకెళ్తున్న ప్యూన్ కుర్రాడు ఠక్కున ఆగిపోయి, "ఉద్యోగాలు ఇలా రావయ్యా, బాబూ! దీనికీ ఓ పద్ధతంటూ ఉంది. రెండు వేలు పారేస్తే ప్యూన్ ఉద్యోగం, అయిదువేలు గుమ్మరిస్తే గుమాస్తా ఉద్యోగం దొరుకుతాయి."

"నా దగ్గర డబ్బు లేదే."

"అయితే ఉద్యోగం రాదే! నువ్వెక్కడ దాపురించావయ్యా మా ప్రాణాల మీదికి! వెళ్ళు, వెళ్ళు..."

భాస్కరం నీరసంగా ఏదో తిట్టుకుంటూ నడుస్తున్నాడు.

మరో అభ్యర్థికి ఇంటర్వ్యూ ప్రారంభమయింది.

జానకిరామయ్యగారికి విసుగేసింది ఈ గొడవ చూసి.

"ఒరేయ్, గోపీ!" గట్టిగా కేక వేశారు.

పిల్లలంతా ఆట ఆపి అలా బొమ్మల్లా నిలబడ్డారు.

"ఒరేయ్, గోపీ! ఇదెక్కడి దిక్కుమాలిన ఆటరా! ఎవరు నేర్పాడు మీకివన్నీ? పుస్తకాలు తీసి చదువుకోకూడదూ ఇలా ఆడుకోకపోతే? చదవకపోతే ఎలా పాసవుతార్రా?

గోపి తల దించుకున్నాడు. మరో తుంటరి కుర్రాడు ఠక్కున సమాధానం చెప్పాడు సిన్సియర్‌గా.

"పేసవ్వాలంటే చదవక్కర్లేదు, తాతగారూ! మా మాస్టారి దగ్గర ప్రైవేట్ చదివితే రాయకపోయినా పాస్ చేసేస్తారు. కదరా, బాచీ..."

జానకిరామయ్యగారికి తల దిమ్మెక్కి పోయింది ఆ జవాబు విని.

"అసురసంధ్యవేళ ఏమిట్రా ఈ అల్లరి? పొండి, పొండి... ఇళ్ళకు పొండి" అని గట్టిగా మందలించారు.

పిల్లలంతా అసహనంగా ఆయన వైపు చూసి, ఇష్టం లేనట్టు నెమ్మదిగా విడిపోయారు.

వాళ్ళ నటు పోనిచ్చి గోపి ఇంట్లోకి జారుకున్నాడు.

జానకిరామయ్యగారి ఆలోచనలు పరిపరి విధల పోతున్నాయి.

వద్దనుకున్న గతం సాంద్రత నింపుకుని మరీ ఎదురవుతోంది.

తనప్పట్లో ఎఫ్.ఎ.పాసయ్యాడు. బ్రిటిష్‌వాళ్ళ పరిపాలనలో దేశం దాస్యవిముక్తి పొందలే దింకా.

ఆ రోజుల్లో ఆ పాటి చదువుకునే వారే అరుదు. ఏదో కాలక్షేపానికనే చదువుకోవడం కానీ, ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేదు తనకి.

అయినా, శ్రీపాదవాళ్ళ నర్సింగరావూ, గొర్తి వెంకటసుబ్బడూ తననీ ఉద్యోగంలో చేరమని బలవంత పెట్టారు. కాగితం ముక్క పడేస్తేనే ఉద్యోగం వచ్చే రోజు లవి.

"నన్ను మరీ ఇబ్బంధి పెట్టకండ్రా. ఉద్యోగం నిషా లాటిది. అందులో చేరితే మరి విడువ బుద్ధి పుట్టదు. తల అమ్ముకున్న తర్వాత ఆత్మగౌరవం సంగతి మర్చిపోవాల్సి వస్తుంది. అదీకాక, నేను ఉద్యోగమంటూ ఊర్లమ్మట తిరిగితే, మా వ్యవసాయం ఎవడు చూస్తాడ్రా! వద్దురా, బాబూ, నా కీ ఉద్యోగం అక్కర్లేదు" అని చెప్పాడు ఖండితంగా.

వాళ్ళు మరి ఇబ్బంది పెట్టలేదు తనని.

పొలం పుట్ర, గొడ్డూ గోదా- ఇవే శాశ్వత మనుకుని చేత చిక్కిన అదృష్టాన్ని చేజేతులా దూరం చేసుకున్నాడు తను.

దాస్యశృంఖలాలు తెగి దేశమాత స్వాతంత్ర్యం సంపాదించింది. ప్రజారాజ్యం నెలకొంది. గాంధీ మహాత్ముడి బోధనా పథంలో ప్రయాణం చేస్తామని ప్రతిజ్ఞ పలికారు పాలకులు.

నాటకంలో రంగం మారినట్టు అకస్మాత్తుగా తన జీవితం కొత్త మలుపు తిరిగింది.

ఇనాందారీ భూముల అబాలిషన్ చట్టం వచ్చింది.

దున్నే వాడిదే భూమి అయింది. పొలం గట్టు మీద గొడుగు నీడలో రైతు కూలీల నదమాయించే భూస్వామి నీడ లేని వాడయ్యాడు.

మండు టెండలో చెమటోడ్చి కష్టించే కర్షకులు మహారాజు లయ్యారు. సమసత్వం ఈ విధంగా సాధించింది ప్రభుత్వం.

మిగిలిన చెక్కా ముక్కా అమ్ముకుని పిల్లలతోపాటు పట్నం చేరాల్సి వచ్చింది తను— అదీ కమల పట్టుదలమీద.

ఇదిగో సామ్రాజ్యాలన్నీ మంట కలిశాయి.

శిథిల వైభవం వెక్కిరిస్తూ నవ్వుతోంది.

నిజానికి ఆ రోజు రాఘవకి నాలుగు ముక్కలు చదివించడం చేతే వాడీ రోజు ప్రయోజకుడై తనని పోషిస్తున్నాడు.

అప్పటి విద్యా విధానం వేరు, జీవన ప్రమాణం వేరు.


# మంట • దురద • రక్తం కారడం
# మూల వ్యాధికి మొదటి లక్షణాలు.

## వెంటనే చికిత్సను మొదలెట్టండి.
## ఆపరేషన్ చేసే పరిస్థితిని రానియ్యకండి.

మూలవ్యాధి సాధారణంగా వచ్చే వ్యాధి. కాని అశ్రద్ధ చెయ్యడం వల్ల అది ముదిరిపోవచ్చు. అప్పుడిక ఆపరేషన్ చెయ్యవలసి రావచ్చు.

మూలవ్యాధికి ప్రభావంతో పనిచేసే చికిత్స, ప్రెపరేషన్-హెచ్★. దీన్ని విదేశాల్లోని ప్రముఖమైన డాక్టర్లు సిఫార్సు చేస్తారు.

ప్రెపరేషన్-హెచ్ ఔషధయుక్తమైన మలాము, అద్వితీయమైన ఫార్ములా— త్వరగా ఆ బాధ, దురదా నుంచి ఉపశమనం యిచ్చి, నిజానికిది వాపును తగ్గించి మొలలుగల కండరాలను ముడుచుకుపోయేలా చేస్తుంది. ప్రెపరేషన్-హెచ్, అక్కడ జారుడు చేసి, సుఖ విరోచనం అయ్యేలా చేస్తుంది.

15 గ్రా., 30 గ్రా. మరియు 50 గ్రా. ట్యూబుల్లో దొరుకుతుంది.




* Licensed user of TM: Geoffrey Manners & Co. Ltd.

GM-PH-84-TL

27-2-85

రాను రాను దేశంలో విద్య బలహీనమయింది. అర్థవంతమైన విద్య సామాన్యుడి కందుబాటులో లేనంత స్థాయికి ఎదిగింది. మారే మంత్రివర్గాల ఆటుపోటుల్లో మరింత దిగజారిపోయింది సామాన్యుడి విద్య. లెక్కకు మించినన్ని విద్యాలయాలు, కళాశాలలు వెలసి పట్టభద్రుల సంఖ్య అమితమయింది.

దేశం ఏ సౌభాగ్యం సాధించిందో తెలీదు గాని, ముద్ర కొట్టబడి దేశం మీదికి విడిచి పెట్టబడ్డ నిరుద్యోగుల సంఖ్య ప్రబలింది.

నిరుద్యోగ సమస్య విశ్వరూపం దాల్చింది.

ఏకదీక్షతో, ఏక ముఖంగా తెల్లవారి పరిపాలనకి అడ్డు తగిలి, వాళ్ళ నీ దేశం నుండి తరిమి కొట్టగల్గిన భరతమాత పుత్రులు దేశంలో తలెత్తే విభిన్న సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యత చూపడం లేదు. నిజానికి మరింత దోహదం చేస్తున్నారు.

ప్రాంతీయతత్త్వం, కులతత్త్వం, మతాతత్త్వం వీరవిహారం చేస్తున్నాయి.

ఆర్థికపరంగా, రాజకీయపరంగా, మతపరంగా ఎన్నో కఠిన పరీక్షల నెదుర్కొంటోంది స్వతంత్ర భారతి.

నగటు మనిషి జీవన ప్రమాణం తల్లకిందులయింది. దారిద్ర్యరేఖ దిగువ ఎందరో అల్లల్లాడి పోతున్నారు.

ఇన్ని సమస్యల మధ్య తా నేపాటి? ఉత్తుంగ తరంగాల్లో నీటిబొట్టులాటి వాడు.

ఈ సమస్యలకు పరిష్కారం చూపే మహానుభావుడు ఎవరైనా ఉద్భవిస్తే బాగుణ్ను.

అది సంభవమా?

రాను రాను సంకుచితమవుతున్న మానవ మేధస్సు మహానుభావుని సృష్టించి ఇస్తుందా? మహాత్ముడికి మళ్ళీ జన్మ నిస్తుందా?

గేటు తెరుచుకుంటున్నట్టు కిర్రున చప్పుడయింది.

అవిరామంగా, సాగర తరంగాల్లా సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలనుండి బయట పడే ప్రయత్నంలో తలెత్తి చూశారు జానకిరామయ్యగారు.

తన నావరించుకున్న నిస్పృహనుండి బయట పడాలనీ, నిరుద్యోగ రక్కసిని మట్టుపెట్టాలనీ నిష్ఫల పోరాటం సాగించి, పరాజితుడైన యోధుడిలా నీరసంగా ఇంటికేసి వస్తున్నాడు.

బావూజీ!

** ** **

గోదావరి ఎక్స్‌ప్రెస్ రాజమండ్రి బ్రిడ్జిమీద శబ్దం చేస్తూ పరుగులు తీస్తోంది. బాపూజీ కిటికీ లోంచి చూస్తున్నాడు.

పున్నమి వెన్నెల్లో, పారాణి పెట్టుకున్న ముత్తయిదువులా తళతళా మెరిసిపోతోంది గోదావరి.

కార్తీకమాసం కావడాన రివ్వు రివ్వుమని సన్నగా చలిగాలి.

పెద్దింటి ఆడపడుచులా నింపాదిగా, హుందాగా వెన్నెల నెమరేస్తూ కొత్త అందాలు సంతరించుకుంది తల్లి గోదావరి.

ఇలాటి సజీవ దృశ్యం చాలు జన్మాంతం గుండెలో దాచుకునేందుకు. ప్రకృతి పరవళ్ళు కొందరిలో రసహృదయాన్ని తట్టి లేపితే, ఇంకొందరికి అర్థరహితంగా కనిపిస్తాయి.

దృక్పథాల్లో తేడా—అంతే!

వీటి కతీతంగా బాపూజీ మనస్సు తను హాజరైవచ్చిన ఇంటర్వ్యూ మీదే ఉంది.

ఎంత తెలివి తక్కువ ప్రశ్నలు వేశారు వాళ్ళు!

అవి విలువలేని ప్రశ్నలని తెలిసినా జవాబు చెప్పక తప్పలేదు. అడిగేవాడికి చెప్పే వాడెప్పుడూ లోకువే మరి.

నిరుద్యోగులమీద ప్రాక్టికల్ జోకు లేసుకుంటూ మనసారా నవ్వుకుంటున్న బ్యూరోక్రసీకి అంత్యక్రియలు జరిగే దెప్పుడు? జరిపే దెవ్వరు?

"నువ్వీ ఇంటర్వ్యూ హాలు కొచ్చేటప్పుడు ఈ ఆఫీసు మొత్తంమీద ఎన్ని మెట్లెక్కావు?"

"మూ డేళ్ళయి డిగ్రీ వచ్చినా, నీ కింకా ఉద్యోగం దొరకనే లేదంటే ఆ లోపం నీ లోనే ఉండి ఉంటుంది—అదేమిటో చెప్పగలవా?"

"నీ కీ గుమాస్తా ఉద్యోగానికి అపాయింట్‌మెంట్ ఆర్డ రొచ్చిన నాడే, మరో ప్రైవేట్ కంపెనీలో ఇంతకన్నా ఎక్కువ జీతంమీద బంట్రోతు ఉద్యోగం వచ్చిం దనుకో. అప్పుడీ రెండింటిలోనూ దేన్ని ఎంచుకుంటావు?"

అన్నం మెతుకులకి మొహం వాచిన వాడికి 'బాదం హల్వా రుచిగా ఉంటుందా, మైసూర్‌పాక్ రుచిగా ఉంటుందా' అని అడిగే అధికారం వాళ్ళ చేతిలో ఉండి, అడుగుతున్నారు.

కసిగా పిడికిలి బిగించాడు బాపూజీ.

ప్రతి ఇంటర్వ్యూ ఇలానే అర్థరహితంగా ముగుస్తోంది. రాదని తెలిసినా, వస్తుందేమో అన్న ఆశకూడా మిగలడంచేత ప్రయాణాలకే ఎంతో డబ్బు తగలేయాల్సి వస్తోంది.

ప్రతిసారీ తనను పంపేధానికి నాన్న ఎంత ఇబ్బందికి గురవుతున్నారో తెలుసు.

పెళ్ళిడొచ్చిన అమ్మాయి తల్లి తండ్రుల గుండెల మీద కుంపటి. కానీ, ఉద్యోగం రాని అబ్బాయి వాళ్ళ గుండెల్లోనూ మండే కొలిమి.

ఈ నిరుద్యోగ బాధనుండి విముక్తి కలిగే దెప్పుడు?

అస లీ జీవితంలో ఎప్పటికైనా ఉద్యోగం దొరుకుతుందా!

"ధనవంతుడు మరీ ధనవంతు డవుతున్నాడు. పేదవాడు చివరికి ముష్టివాడవుతున్నాడు. ఈ ఆర్థిక అసమానతకి కారణం ఏమిటి? ఇది కొందరు స్వార్థపరులు సాగిస్తున్న కుట్ర కాదూ? ఈ బూర్జువా వ్యవస్థని తమ కనుకూలంగా మలచుకున్నది వాళ్ళు. వివిధ దశల్లో దోపిడీ కొనసాగిస్తున్నదీ వాళ్ళే. ఈ అసమానతలన్నీ తొలగిపోవాలంటే ఒక్కటే మార్గం—సాయుధ విప్లవం!"

ఆవేశంగా చెప్పుకు పోతున్నా డో యువకుడు, అతని పక్కనే కూచున్న మధ్య వయస్కుడితో.

"మీ కుర్రాళ్ళకి నైరాశ్యంలోంచి విప్లవం పుట్టుకొస్తుందే గానీ, మౌలికమైన విప్లవం కాదయ్యా ఇది! ఈ రోజు నీ కో ధనవంతుడు పిలిచి లక్ష రూపాయలిచ్చే డనుకో. నువ్వేం చేస్తావ్? దాన్ని కోటి రూపాయలు చేయడానికి అహర్నిశలూ కష్టపడ్తావ్. అప్పు డీ ఆకలి కేకలు, విప్లవ కవిత్వాలు నీ దరిదాపులకి రానివ్వవు. నిజమేనా?"

యువకుడు మళ్ళీ ఆవేశంగా ఏదో చెప్పబోయాడు. మధ్య వయస్కు డతణ్ణి వారిస్తూ మళ్ళీ కొనసాగించాడు.

"ఉన్నదాన్ని మరింత పెంచుకోవాలని తాపత్రయం ఒకరిదైతే, లేనిదాన్ని సాధించే ప్రయత్నం కొందరిది. ఇద్దర్నీ తప్పు పట్టలేం ఏ విధంగానూ! ఉన్నవాడిమీద ఏడ్చే కంటే వాడి కున్నది మన కెందుకు లేదని తరచి చూసుకోవాలి. వాడు దాన్ని ఎలా సాధించ గలిగాడో తెలుసుకో గలగాలి. అది అర్థం కాకపోయినప్పుడు నువ్వన్నట్టు తుపాకీలో గుళ్ళు దట్టించుకుని దేశంమీద పడ్డాలి..."

కుర్రాడి మొహం ఎర్రబారింది.

"అసలు మీరు, మీరే కారకులు దీని కంతటికీ. ఏ విప్లవాన్నైనా, ఏ ఉద్యమాన్నైనా అణగార్చేది మధ్యతరగతి మనుషులే. రాజీ పడ్డమే తప్పించి రాజుకునే స్వభావం లేని జడపదార్థాలు..." అన్నాడు విసురుగా.

రాజీగా నవ్వి మళ్ళీ అందుకున్నాడు మధ్య వయస్కుడు—"తెలిసో, తెలియకో సరిగ్గా నిజమే చెప్పావు నువ్వు. మధ్యతరగతి మనిషి రెండు పక్కలా ఒకే పదునుతో ఆలోచిస్తాడు. అసలు విప్లవమంటూ పుడితే ఈ తరగతిలోనే పుట్టాలి. ఆ విప్లవమే విజయం సాధించి తీరుతుంది. విప్లవమంటే కత్తులూ, కటార్లూ పట్టుకుని దేశాన్ని బీభ



త్నం చేయడం కాదయ్యా. మౌలికంగా మార్పు తీసుకుని రావడం. విభిన్న మనస్తత్త్వాలున్న వారిలో ఒకే అవగాహన కలగ చేయడం."

"కడుపు నిండిన వాడికి ఆకలి బాధ ఏం తెలుస్తుంది లెండి? ధనవంతుడి కొడుకు పేదరికం మీద వి స్పే రా సినట్టు మా యువతరాన్ని దారి మళ్ళించే ప్రయత్నం మీరెప్పుడు మానేరు కనక? కానీయండి..."

"ఒరేయ్! ఏమిట్రా? బావగారితో మాట్లాడే తీరు అదేనా! మీరు కూడా వాడితో సమానంగా వాదించడ మేమిటండీ?" పై బెర్త్ నుండీ ఆడగొంతు వినిపించింది. దుప్పటి కొద్దిగా తప్పించి సూటిగా చూసిందామె.

"వాదించుకోకపోతే ఒకరి భావాలు మరొకరికెలా తెలుస్తాయి, రత్నా? కొన్ని అపోహలు తొలగిపోవాలంటే ఇలా వాదించుకోవడమే మంచిదనిపిస్తోంది. ఈ సొదంతా నీ కెందుగ్గానీ, తిరిగ్గా ముసుగెట్టి పడుకో."

"చూడు, బామ్మర్దీ. విప్లవమంటూ కేక లేయడం మానేసి నెమ్మదిగానే వాదించుకుందాం. నో అబ్జక్షన్ కదా—రైట్।"

ఆవిడ ముసుగు తన్నేసి మరో పక్కకి ఒత్తిగిల్లి పడుకుంది.

రాజమండ్రి స్టేషన్‌లో రైలాగడమూ, కొంత మంది ప్రయాణీకుల్ని తనలో ఇముడ్చుకుని పరుగు తీయడమూ జరిగిందీ మధ్యలో.

బాపూజీ ఒక్క అక్షరం పొల్లు పోకుండా వింటున్నాడు.

"రైట్. పాయింట్‌లోకి వొద్దాం. ఇందాకే మన్నావ్? ఆకలి తీరిన వాడికి మరోడి ఆకలి బాధ ఎలా తెలుస్తుందనా? నిజమే! ఈ ఆకల్ని జయించాలని నేనెంత కష్టపడ్డానో నీ కేం తెలుసు? జీవితంలో మొదటి మెట్టెక్కిన నువ్వు పైనున్న వాణ్ణి చూసి ఈర్ష్య పడేకన్నా, అన్ని మెట్లూ ఎక్కగలిగిన వాడి చాకచక్యానికి, ఆ అంతస్తు వెనుక ఉన్న కష్టానికి జోహారు చెయ్యి—అదే ప్రాక్టికల్ థింకింగ్!"

ఈ మారు శ్రద్ధగా వింటున్నాడా యువకుడు.

"ఈ రోజుల్లోనే కాదు, ఆ రోజుల్లోనూ నిరుద్యోగ సమస్య ఉండేది. ఉన్న తక్కువ ఉద్యోగాలకు అభ్యర్థుల సంఖ్య తక్కువేం కాదు మరి. నేనూ ఈ పోటీకి తట్టుకోలేక వెనుకబడ్డాను. నీలానే ఇంటర్వ్యూలకని కొంత కాలం డబ్బు తగలేసేక, మరిక ఉద్యోగం రాదని నిర్ణయించుకుని..."

ఆపి సిగరెట్ వెలిగించుకున్నాడతను.

బాపూజీ నిర్నిమేషుడై చూస్తున్నాడతణ్ణి.


"ఉన్న కొద్దిపాటి పొలాన్ని తెగనమ్మి డాబా గార్డెన్ జంక్షన్‌లో చిన్న 'పాన్ దుకాణం' పెట్టుకున్నాను. చదుకుకున్న వాడి నన్న జాలితోనో, ఏమో నా వ్యాపారానికి అందరూ మద్దతు ఇచ్చారు. ఆత్మగౌరవాన్ని పక్కకు నెట్టేసి అలాగే శ్రమించి అంచెలంచెలుగా ముందుకి సాగాను. ఆ కష్టానికి ఫలితం—ఇదిగో—ఈ రోజు వైజాగ్‌లో ఒక సినిమా హాలు!"

బాపూజీ తుళ్ళి పడ్డాడు.

వెన్నుమీద కొరడాతో కొట్టినట్టనిపించింది.

ఆ కుర్రాడింకా కన్విన్స్ అయినట్టు కనిపించలేదు.

మధ్య వయస్కుడు అదే ధోరణిలో చెప్పుకుపోతున్నాడు. "కష్టపడ్డ వాడికి ఫలితం దక్కదని ఎవరన్నా నరేనే నొప్పుకోనోయ్. ఉన్నదానితో రాజీ పడమని నే ననుగానీ, లేనిదానికోసం పరితపిస్తూ నిరర్థకంగా కూచోడం న సేమిరా సహించను. జీవితంలో పై అంతస్తుల కెగబాకాలంటే కిందినుండే అది సాధ్యమవుతుంది. ఇందాక నీతో అన్నట్లు కింది మెట్టు—మీది మెట్టు!"




ఆ తరవాత వాళ్ళ సంభాషణ అదృష్టాలమీద, వ్యాపారంలో పోటీలమీద ఎటెటో అల్లుకుపోయింది.

బాపూజీ సగం వింటూ, సగం మానేస్తూ ఆలోచనలో పడ్డాడు.

ఆ తరవాత కాసేపటికి చిన్న కునుకు పట్టి, మళ్ళీ విశాఖపట్నంలోనే తెలివి వచ్చింది.

** ** **

సైకిల్ బెల్ గణగణ లాడ్డంతో చదువుతున్న 'భాగవతం' లోంచి తలెత్తి చూశారు జానకిరామయ్యగారు.

గేటు తీసుకుని ఇంటి వైపు సైకిల్ నడిపించుకొస్తున్నాడు బాపూజీ. అతని మొహం ప్రసన్నంగా ఉంది.

పెదాలపై చిర్నవ్వు తొణికిస లాడుతోంది. సైకిల్ స్టాండు వేసి, కారేజీకి కట్టి ఉన్న పాత న్యూస్ పేపర్ల కట్ట బయటకు తీస్తున్నాడు.

ఆఫీసుకు బయల్దేరిన రాఘవ గుమ్మం దగ్గర అలాగే నిలబడి పోయాడు.

పాత పేపర్లన్నీ వరండామీదికి గిరాటేసి, ఇంట్లోకి నడిచాడు బాపూజీ. చేతిలో ఒక పొట్లంతో.

"ఏమిట్రా అది!" కుతూహలంగా అడిగాడు రాఘవ.

"మైదాపిండి." మరో ప్రశ్నకు ఆస్కార మివ్వకుండా ఇంట్లోకి నడిచాడు బాపూజీ.

జానకిరామయ్యగారు ప్రశ్నార్థకంగా చూశారు రాఘవ కేసి.

రాఘవ అదే ఆశ్చర్యంలో ఉన్నాడింకా.

ఇంట్లోనుండి బాపూజీ గొంతు వినవస్తోంది.

"త్వరగా ఈ మైదాపిండి ఉడికించి పెట్టవే, అమ్మా. ఈలోగా పేపర్లు కత్తిరించి సిద్ధంగా ఉంచుకుంటాగాని."

"పేపర్లేమిటి, మైదా ఏమిట్రా?" అయోమయంలో పడింది శారద.

పాంటులోంచి లుంగీలోకి మారిపోతూ సన్నగా ఈల వేశాడు బాపూజీ.

ఆ తరవాత నెమ్మదిగా చెప్పాడు. "రాని ఉద్యోగాలని వెతుక్కుంటూ వ్యర్థంగా కూచునేకన్నా ఏదో ఒక పని తలపెడితే అటు కాలక్షేపమూ అవుతుంది, ఇటు నాన్నకు సహాయ పడినట్టూ అవుతుందని..."

"అవుతుందని?"

"కిషన్‌లాల్ అగర్వాల్ కొట్లోంచి పాత కాగితాల్ని తీసుకొచ్చానే, అమ్మా. అవి కవర్లు చేసి అతనికిస్తే వందకి అయిదు రూపాయ లిస్తా నన్నాడు."

"శివశివా!" భరించలేనట్టు చెవులు మూసుకుంది శారద.

రాఘవ గతుక్కుమన్నాడు.

జానకిరామయ్యగారి మనసు బరువెక్కింది. మరో క్షణం నిలవలేక పోయా రాయన. ఒక్క ఉదుటున ఇంట్లోకి నడిచారు.

"ఏమిట్రా ఇది? కవర్లు చేసుకునే దిక్కుమాలిన పనికి దిగజారమని ఎవరు చెప్పార్రా నీకు? బి.ఎ. చదువుకున్నావు. రేపో, మాపో ఉద్యోగం రాకపోతుందా?"

పెదాలపై స్థిరమైన నవ్వుతో సమాధానం చెప్పాడు బాపూజీ.

"దొంగతనం చేసేకన్నా, అడుక్కునే కన్నా ఒళ్ళొంచి పని చేయడం తప్పా, తాతయ్యా! ఉద్యోగం దొరికేంతవరకూ ఖాళీగా కూచోడమెందుకని ఇందులోకి దిగాను."

"మన వంశం... మన కుటుంబ గౌరవం..." ఏదో ప్రశ్న వేయబోయారు.

"గత వైభవాల జ్ఞాపకాల్లోంచి మీరు బయట పడలేరు, తాతయ్యా! ఆ లోకం లోనే మీరుండండి గానీ, ఇవాళ్టి అవసరమేదో ఇన్నాళ్ళకి గానీ అర్థం కాలేదు నాకు. అందుచేత బాగా ఆలోచించే ఈ పనిలోకి దిగాను.

"ఎంత కష్టపడితే అంత లాభమూ ఉంటుందీ వ్యాపారంలో. కనీసం ఇంటర్‌వ్యూ ఖర్చులైనా రాబట్టుకోలేకపోతే ఈ పోటీ సమాజంలో బతకడమెలా, తాతయ్యా?"

రాఘవ కొడుకు నోసారి ఆప్యాయంగా చూసి ఆఫీసుకి బయల్దేరాడు. శారదమ్మ ఇంకా తేరుకోలేదు.

జానకిరామయ్యగారు మరి మాట్లాడలేదు. మళ్ళీ వరండాలో కూచుని చూస్తున్నారు—ఈ మారు భాగవతాన్ని కాక గాలికి రెపరెప లాడుతున్న పాత పేపర్ల కేసి.

బాపూజీ చకచకా కత్తిరిస్తూ సైజులవారీగా కవర్లు చేస్తుంటే, వీధిని పోయే ఒకోరిద్దరు ఆశ్చర్యంగా ఆగి ఒక్క క్షణం అటుకేసి చూసి మరీ వెడుతున్నారు.

జానకిరామయ్యగారి మనసు ఉద్విగ్నమయింది.

కళ్ళు చెమర్చాయి ఆర్ద్రతతో.

కవర్లు పట్టుకుని వాటిని ఎండలో పెట్టబోతున్న బాపూజీని వారించే రాయన.

"నువ్వు లేవద్దురా. వాటిని నేనే ఎండలో పెట్టి వస్తా కానీ, నీ పని నువ్వు కొనసాగించు."

కవర్లన్నీ ఎండలో పెట్టి, గాలి కవి ఎగరకుండా వాటిలో గులకరాళ్ళు వేస్తున్న మామగారి కేసి ఆశ్చర్యంగా చూస్తూ బొమ్మలా నిల్చుండిపోయింది శారద.

"చిన్నవాడివైనా జీవిత సత్యాన్ని చాలా చక్కగా చెప్పావురా, నాయనా! అమ్మాయ్, శారదా! ఇంట్లో మరో కత్తెరుంటే నాకూ పడెయ్. మరో మాట. అలాగే ఆ భాగవతాన్ని తీసి బీరువాలో భద్రపర్చు" అంటూ యజ్ఞాన్ని నిర్వర్తించే సోమయాజిలా ఆమె వైపు చూశారు జానకిరామయ్యగారు.

*